



# అడివోడు

## శ్రీనివాసమూర్తి

రెడ్డిగార్ల గడ్డాలు గీకి, నెత్తులు గొరిగి యెండ చుర్రుమనే యాలకు సుంకులమ్మ కట్టకాడి కొచ్చినాడు గూనిమాదన్న. అందరూ గూనిమాదన్నా! అని పిలుస్తారుగానీ నిజంగా గూనిలేదు. మనిషి కాసంత గిడస, ఎడల్పు, చాటంత మొగంతో మెడలు భుజాలలోకి ఇరికిచ్చినట్టుంటాయి.

మాదన్న పెట్టె పక్కన బెట్టి నెత్తికి చుట్టుకున్న తువ్వాలు తీసి యిదిలిచ్చి పైన యేసుకున్నాడు...

"ఓ బావోయ్! గంతసేపు ఆగరా! నేనొత్సాండా," కూతేసుకుంటూ సేన్లోంచి పరివారొచ్చినాడు నేస్తుడు అడివోడు...

చిన్నగున్నప్పుడే అడివోడు అమ్మా, నాయినా కాలం జేసినారు. అమ్మా నాయన్ను మింగి వీడు భూమ్మీద పడ్నాడని వూర్లో వాళ్లంతా చెప్పారు. అడివోడు ఆ మాట వొప్పుకోడు. నన్ను పుట్టిచ్చి వాళ్ల దావన వాళ్లు పోయినారని అంటాడు. సర్కారు బళ్లో అయిదో తరగతి హాజరుపట్టీలో వాని పేరు 'ఉప్పరి కిష్టన్న' అని రాసుంది. బడి సాలిచ్చుకున్నంక అది అడివోడు అయ్యింది.

అడివోనికి రాని పని లేదని వూర్లోవాళ్ల నమ్మకం. నెలకో, రెన్నెల్లకో వొగసారి వూరికొచ్చే లైన్‌మ్యాన్ ఎంట బడి కరెంటు పని నేర్చుకున్నాడు. తెలుగుగంగ ప్రాజెక్టు పనికాడికి బొయ్యి ట్రాక్టరు నడపడం నేర్చుకున్నాడు. వూర్లో ఆచారిని మంచి చేస్కోని చెక్కపని నేర్చుకున్నాడు. అడివోడు బండి చక్రాలు చెక్కితే చెన్నకేశవసామి రథం చక్రాల లెక్కనుంటాయని సేద్యగాండ్లు మెచ్చుకుంటారు. కమ్మరాయన నేస్తంజేసి కమ్మరి పని నేర్చుకున్నాడు. ముసిలోల్ల ప్రాణం తీసి చిట్కా వైద్దం వొంట బట్టించుకున్నాడు. పోయిన శివరాత్రికి వూర్లో తిరణాలప్పుడు రెడ్డిగారి వొలపటిగిత్త కుంటుబడింది. వచ్చే బేస్తారానికి అది రాతిదూలం గుంజల్ల. ఎవురెన్ని వైద్దాలు జేసినా లెయ్యలా! అడుగు ముందుకెయ్యలా! యింగ లాబం లేదని అడివోన్ని పిల్లంపినారు. అడివోడు అర నిమిషం కండ్లు మూసి ఆలోచన చేసినాడు. కలబంద తెచ్చినాడు. జొన్నదంటు మంటయేసి కలబంద పట్టలు శాకానికి పెట్నాడు. కాకమీదనే పసురు బిండినాడు. ఆ పసుర్ను ఎర్రమన్నులో కలిపి వుడికిచ్చినాడు. దాన్ని తీస్కొచ్చి గిత్తకు పట్టేసినాడు. అంతే వారం తిరిగేటాలకు గిత్త లేచి నిలబడింది. రాతి దూలాన్ని బర్రుమని వొక్క లగువున మైలు దూరం గుంజింది. 'అవురా అడివోడా!' అని వూరు వూరంతా తిరణాల్లోనే ముక్కున యేలేసింది.

అడివోడు పనిలో పడ్నాడంటే నిజంగా అడివి మనిషే. ఏదన్నా నేర్చుకోవాలని మనసులో పడిందంటే ఆ యిద్య వొచ్చేదంక ఎనక్కుతగ్గే రకం కాదు. బువ్వ ముట్టడు. రెప్ప మూయడు. సదువు సక్కంగ లేదుగానీ అడివోడు యింజనీరేనని నేస్తుడు గూనిమాదన్న నలుగురితో చెప్తుంటాడు.

అడివోడు, మాదన్నా కట్టమీద కూర్చునుండగానే, బాట దిగిన మాదిగోల్లు కట్టకాడి కొచ్చినారు. "యాడ్నిం చొత్సాండారు సిన్నా," మాదిగోల్లను అడిగినాడు మాదన్న.

"ఆత్మకూరు బొయ్యొత్సాండాం- మాడబ్బా! నువ్వు వూర్లో గడ్డాలు గొరగనంటివి. వారానికొకసారి మాకు తప్పతదా," వొకాయన జవాబిచ్చినాడు.

"వూరి కట్టుబాటు. నేనేం జేత్సా. అదేమన్నా నా చేతుల్లో వుందా? తీసెయ్యనీకి నేనేం ఈ పొద్దు గొరుగుతా, అనేక కాపోల్లు పిల్చి అడిగితే ఎవరు జవాబు చెప్తారు."

"నువ్వే పొయ్యి కాపోళ్లని అడగల్ల. మేము ఆడిచ్చే నాలుగు దుడ్లు నీకే ఇస్తం. లాబం నీకే గద!" అంటూ మాదిగోల్లు కట్టదాటి పోయినారు.

యిట్టాంటి చిల్లరయవ్వారాల్తో నాకేంటికి పని అని అడివోడు సాధువు లెక్క కట్టమీద కూర్చున్నాడు. "యింగ రారా! అడివోడా!" అని పెట్టె తీస్కోని యింటి దావ బట్నాడు మాదన్న.

మాదిగోల్లు చెప్పింది రైటేననిపిచ్చింది మాదన్నకు. పెండ్లాంతో ఆ మాటే అన్నాడు.

"అవ్ మామా! అప్పుడెప్పుడో వూరోల్లిచ్చిన మిరాసి భూమి నీకే దిక్కుల్యా! ఆ రెండెకరాలు గూడా పెద్ద రెడ్డే చేసుకుంటున్నాడు. నీ మొకాన ఏటికి రెండు సంచుల జొన్నలు యిదిలిస్తున్నాడు. వూరి కట్టుబాటు మీద నిలబడి నువ్వేం బాముకున్నట్టు." పెండ్లాం మాటలతో ఆలోచనలో పన్నాడు మాదన్న. మళ్లీ ఆ యమ్మే చెప్పింది. "కాపోల్లకాడ ఒగమాట యిడిసి సూడు. మాది గోల్లేం తక్కవున్నారా? యిపుడు వాళ్ల పొట్టెగాండ్లందరూ సదువుకోని కొలువుల కొచ్చినారు. వూరు మారింది. వాళ్లగ్గూడ పన్జేస్తే నాలుగు దుడ్లొస్తాయి."

యింగ మాదన్నకు రేత్రంతా నిద్రలేదు. అడివోడు మాత్రం తుమ్మచెట్టు కింద గురకగొట్టి నిద్రపోయినాడు. పొద్దున లేచి కత్తి నూరుకుంటున్నా మాదన్నకు అదే ఆలోచనే. పెద్ద రెడ్డికాడికి బొయ్యి యేమేం మాట్లాడాల్నో మనసులోనే ఎన్నిసార్లో అనుకున్నాడు.

పెట్టె పట్కోని పెద్దరెడ్డి యింటికాడికి పొయ్యేటా లకి ఆడ వూర్లో వున్న కాపోల్లందరూ (రెడ్లు) కట్ట మీద కొలువు తీర్నారు. మాదన్న పెట్టె కింద బెట్టి చేతులు కట్కోని నిలబడ్నాడు. మొన్న జరిగిన ఓట్ల గురించి మాట్లాడ్తున్న పెద్దరెడ్డి ఆ మాటల్ను మధ్యలోనే ఆపి,

"ఏందిరే! పోయిన ఆదివారం పిలిపిస్తే రాలేదు," అరుగు మీద నుంచి బొంగురు గొంతుతో అరిచినాడు.

"యాలా రొడ్డీ! పనిబడి ఆత్మకూరుబొయ్యింటి," మాదన్న నోట్లో మాట పూర్తిగా కూడా బయిటికి యిని పియ్యలా.

మాదన్న యేంటికొచ్చినాడో పెద్దరెడ్డికి తెలుసు. మాదిగోల్లు మాట్లాడిన మాటలు అప్పుడే పెద్దరెడ్డికి చేరి నాయి. యియ్యాలో రేపో- ఈ మంగలోడు యీడికొస్తా డని రెడ్డికెరికే. పక్కన్నే గాడిపాట్లో ఎద్దులు జొన్నదంట్లను పటాపటామని కొరుకుతున్నాయి. రెడ్డిగారు ప్రేమతో పెంచుకున్న గిత్త మోరెత్తలాక ఎత్తి మాదన్న పక్క నిర్లక్ష్యం గా చూసి, జొన్నదంట్లను యిష్టంలేనట్టుగా ముందు పండ్లతో కొరికింది. గాసగాడు కల్లెం కాన్నుంచి బుడ్డల కట్టెజల్ల భుజానికెత్తుకోని గాడిపాట్లో కొచ్చినాడు.

"ఏం దొరా! ఎప్పుడొస్తివి ఊర్నుంచి," పెద్దరెడ్డి సంబోధనతో గాసగాడు వొణికినాడు.

"లేదు రొడ్డి, నా పెండ్లానికి జరమొచ్చి పై కాల్తా వుంటే సూదియేపిచ్చనీకి ఆత్మకూరు బొయ్యింటి."

"అవునులే! మీకు పై కాల్తావున్నా సూది యేపిచ్చు కుంటారు. మాకు కింద గూడ కాల్తా వున్నా సూదియే పిచ్చనీక పుర్సతు లేదు."

"యాలా రొడ్డీ! జరమొత్సాంటే..." గాసగాని మాట పూర్తికాలేదు.

"ముక్కు నొత్సే, మూతినొత్సే, ఆ అంటే, వూ అంటే... ఆత్మకూరు బోతారు ఈ నా కొడుకులు. గడ్డాలు గీకిచ్చనీక మాత్రం ఆత్మకూరుబోలేరంట. వూరి మంగ లోడే గొరగాల్నంట. వాయబ్బ! వగలాతని యేం మాట్లా డ్తన్నడో సూడండీ," అంటూ అందరు రెడ్ల పక్క జూసినాడు.

"అవులే! మీరు మాత్తరం యేం జేత్సారు. వొచ్చిన ప్రతి ఆఫీసరుగాడూ, వొచ్చిన ప్రతి గవుర్మెంటూ మీ ముడ్డెనకనే వురకబట్టింది. లేస్తే లోనూ, కూసుంటే లోనూ యింగ మీకు మాత్తరం కొండికి నీరెక్కక ఏమయి తాది. వొక్కొక్క నా కొడుక్కి తట్టెడు గోరోజనముంది. యిడిసేసిన లంజకొడక! కాల్లిరస్తా మళ్లీ మాట్లాడ్నవంటే. యింగసాలన్నా! మత్సయిపాయి మీది. నియ్యక్క, వూరి కట్టుబాటు కాదనే 'పలాతు'లయితిరేమిరా మీరు! మాదిగ లంజకొడుకుల్లారా! వుచ్చనీచాలు లేకపోతే దూము తలిగి సత్సారు," పెద్దరెడ్డి కోపానికి ఎదబడి గాసగాడు జల్ల అట్నే పట్కోని నిలబడ్డాడు. గుడ్ల నిండ నీల్లు నిండినాయి.

"పో పో! తిక్క తిక్క యేసాలు ఎయ్యగాకు నాకాడ! పని చూస్కో పో! యియ్యాల చింపిరోని సేన్లో గుంటిక బాస్తుండారు ఆడికి బో!"

ఆ మాట యిన్నదే ఆలస్యం గాసగాడు జల్ల దీస్కోని గాడిపాడు దాటినాడు. గాసగాన్ని తిట్టిన మాట లన్నీ తనను ఉద్దేశించినవేనని మాదన్నకు అర్థమైంది. మాటలన్నీ తనకే తగిల్నాయి. యింగ యేం మాట్లాడ్తే యేం జేస్తాడోనని భయమైంది. అట్నే కట్టకింద కూర్చు న్నాడు. మాదన్నను పట్టించుకోకుండా రెడ్డి మళ్లీ కాపోల్ల పక్క తిరిగినాడు.

"యింగ బెలగల్లు సంగతి చెప్తా యినండి. అంత వరకూ ఆ వూర్లో వొక్క వోటూ సైకిల్ గుర్తుకేసినోడు లేడు. అన్నీ వాళ్లే గుద్దుకుంటున్నారు. మావోడు గెడ్డం సుబ్బారెడ్డి రంగంలోకి దిగినాడు. వూరికె సూన్నీక అన్నట్టు పోలింగు బూతులోకి పోయినాడంట. వోటేసి నోల్లకు సుక్కలు పెట్టనీక ఆడామె వుందంట. ఎండా కాలమని తాగనీక సీసాలో నీళ్లు పక్కన పెట్టుకుందంట.

"నీల్లియ్యమా! మా రెడ్డి తాగుతాడూ," అని పక్క నున్నోడు సీసా యిప్పిచ్చుకుంటున్నాడు. తాగినట్టే తాగి బాలట్ పెట్టెలోకి అట్నె నీళ్లు గుమ్మరించినాడంట. పక్కనే సీఐ కూడా ఉన్నాడంట. పోలీసోడయితే ఏమి పీకుతాడా. అంత పోతుమొగోడా ఆయన."

పెద్దిరెడ్డి ఎలక్షన్లలో తన వర్గం వాళ్ల క్రీడా విలాసాలను గర్వంగా చెప్పుకుంటున్నాడు. నెమ్మదిగా ఈ పక్క తిరిగి, "గూనోడా! యిక్కడా!" అని దెగ్గరికి పిల్చినాడు.

"మా సిన్నోని కాడ అయిదువేలు అప్పు తీసుకోంటివి గదా. నీకొకసారి మతికి జెయ్యమన్నాడు. యేందో అవుసరం వుందంట. మాదన్నను పిలిపిచ్చి అడుగు నాయనా అన్నాడు," మాదన్న గొంతులో గుమ్మడికాయ దిగింది. కండ్లు కిందికి దించినాడు.

"బీద నా కొడుకు యిప్పుడికిప్పుడు యాన్నించి తెస్తార్రా- పంటల కాల మొచ్చినంక నేనే అడుగుతాలే అని సర్ది చెప్పినా, నువ్వేం చింత చెయ్యగాకు. నీకు యెసులుబాటు అయినప్పుడే కడుదువుగానీ," అని ఆపి మాదన్న మొహంలోకి చూసినాడు.

మాదన్న యింగొక్క మాట మాట్లాల్లేదు. అడిగితే అప్పు కట్టమంటాడేమోనని భయం పట్టుకుంది. "వొస్తా రొడ్డీ!" అని పెట్టె తీస్కోని ఎనక్కు తిరిగినాడు.

మాదన్న పెండ్లామూ, ఆడివోడూ ఈ కతంతా యిన్నారు. ఆరోజు యింగ ఎవరికీ పని చెయ్యబుద్ధి కాలేదు. వున్న ఈ ఒక్క ఆధారమూ పోతే పెండ్లాం బిడ్డలు అడక్క తినాల్సిందేనని మాదన్నకు అర్థమైంది. మామూలుగా మళ్లీ పన్లోబడి యింగ ఆ మాట మరిచి పోదామనుకున్నాడు. అడివోడు సాధువు నుంచి సిద్ధుడైనాడు. మాదన్న యాడికిబోతే ఆడికి ఎంటొస్తున్నాడు. మాదన్న యాడ గడ్డం గీస్తున్నా అట్నే చూసుకుంటూ కూర్చుంటున్నాడు. మాదన్న చేతిలో కత్తి యెట్లా తిరుగుతా వుందో గమనిస్తున్నాడు. సుంకులమ్మ గుళ్లోని పొడుగాటి పట్టా కత్తికీ మంగలోని కత్తికీ 'వారా యేమిటా' అని అడివోడు ఆలోచిస్తున్నాడు. ఏది ఎంత పదునో యేలి మీద గాటు పెట్టి చూసుకుంటున్నాడు.

అట్లా ఉన్న అడివోడు వున్నట్టుండి కనిపిచ్చడం మానేసినాడు. అడివోనితో పని వున్నోల్లందరూ మాదన్న యింటికాడికి తిరిగిపోతున్నారు. ఈ తిక్కలోడు యాదావ బట్కోని పాయనో యేమోనని మాదన్న గూడ దిగులుబన్నాడు. రొండ్రోజులైంది రాలేదు. మూడ్రోజులైంది రాలేదు. నాలుగోరోజు రేత్రికి చెక్కపెట్టెలు పట్కోని బస్సు దిగినాడు అడివోడు.

"యేంటికిరా అవీ," అని ఎంటబడి అడిగినారు అందరూ. అడివోడు నోరిప్పితే వొట్టు. పొద్దున్నే ఆచారి కాడికి బొయ్యి యాపచెక్కలు, బాడిస సుత్తి, వులి తెచ్చుకున్నాడు. తుమ్మ చెట్టుకింద చెక్కలు యేసుకుని రాత్రిం బగల్లు పనిచేసినాడు. ముందు కుర్చీ చేసి పక్కన బెట్నాడు. అడివోడు యేం జేస్తున్నాడో ఎవరికీ అంతు చిక్కలా, ఆఖరుకు నేస్తగాడు మాదన్నకు గూడ చెప్పలా!

వున్నట్టుండి వొగరోజు సుంకులమ్మ కట్టకాడ చెక్క బంకు వెలిసింది. బంకు లోపల కుర్చీ యేసి, తన యింట్లో వున్న పాతకాలపు పెద్ద అద్దాన్ని తెచ్చి బంకులో తగిలిచ్చినాడు అడివోడు. మాదన్న యింట్లోకి పోయి పాత కత్తులు బుడికి తెచ్చుకోని నూరుకుంటున్నాడు. అప్పుడర్థమైంది అందరికీ నేస్తుడు మాదన్న కోసం అడివోడు మంగలి షాపు పెడ్తున్నాడని.

వూరు వూరంతా వులిక్కిపడింది.

మాదన్న తల పట్కోని కూర్చున్నాడు.

"వూరి కట్టుబాటు కాదంటే నన్ను వూరిడిపిచ్చి, యింకో మంగలోన్ని తెచ్చుకుంటార్రా" అని మొత్తుకున్నా అడివోడు యినిపిచ్చుకోలేదు.

"వూరి కట్టుబాటు నీకు మంగలోనికి, వుప్పరోన్ని నాకేం కట్టుబాటు. నిన్నేం వూరిపని మానెయ్యమన్నానా? నీ పని నువ్వు చేసుకో. మాదన్న మంగలి షాపు పెట్నాడు. నేను నీకాడ కూలి జేస్తన్నా. మాలోల్లు, మాదిగోల్లే కాదు ఎవుడొచ్చినా నేను యాడ్నే గెడ్డాలు గీస్తా. యానా కొడుకు కాదంటాడో సూద్దాం."

"నువ్వు గెడ్డాలుగీస్తావా?" అని అక్కడ గుంపయి చిత్రం చూస్తున్న అందరూ అట్టే నిలబన్నారు. అడివోడు రేత్రికి రేత్రి చెక్కలకు సినిమా కాయితాలూ, న్యూస్ పేపర్లూ అంటిచ్చినాడు. మాదిగోల్లు సాయం జేసినారు. చెక్కలకు అంటిచ్చిన న్యూస్‌పేపర్లు పైన 'పిట్టా యెంకటరెడ్డి యిల్లు పేల్చివేత ప్రయత్నం', 'పిట్టా మోహన్ రెడ్డిపై హత్యా ప్రయత్నం- నలుగురికి గాయాలు' వార్తలున్నాయి. ఆ పేపర్లు అడివోడు కావాలనే అంటిచ్చినాడని వూర్లో కాపోల్ల గుసగుసలు.

పదిగంటలకు మాదిగోల్లు టేప్ రికార్డు తెచ్చి బంకులో పాటలు పెట్నారు. అడివోడు మొట్టమొదటి గెడ్డాన్ని నేస్తగాడు గూని మాదన్నకు గీస్తున్నాడు. మాదిగోల్లందరూ సుట్టూ నిలబడి అడివోడి నేర్పరితనాన్ని సూస్తున్నారు. అడివోడి పనితనానికి మంగలి మాదన్న గూడ ముచ్చటపన్నాడు... 'అడివోడు, అడివోడేరా!' అనుకున్నాడు.

"బావా సూస్తివా? నీ షాపుకాడ గడ్డాలు గొరిగిచ్చుకోనీకె టౌన్‌లో నిలబడ్నట్టు వరస బెట్నారు మాదిగోల్లు," పదారు పండ్లు కనిపిచ్చేటట్టు యిగిలిచ్చినాడు అడివోడు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 9 జూన్ 1996*